# న్యాయపరిశీలనం

## ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

కాశ్మీర రాజప్రాసాదానికనతిదూరంలో అసలే చిక్కి శల్యమైపోయిన బడుగు బ్రాహ్మణుడొకడు ప్రాయోపవేశం ప్రారంభించాడు. శ్రీనగరపౌరులతనిచుట్టూ గుమిగూడి ఆ విడ్డూరమే చూస్తూ నిలుచున్నారు.

కాశ్మీరంలో చాలా ప్రాచీనకాలంనించీ బ్రాహ్మణుల ఆమరణాంత నిరాహార దీక్ష ఒక అనూచాన సంప్రదాయంగా ఏర్పడింది. ఆ రాజ్యంలో ఎవరికైనా అన్యాయం జరిగినపక్షంలో సామాన్యంగా కాశ్మీర బ్రాహ్మణులే రాజప్రాసాద పరిసరాలలో నిరాహార దీక్షల కుపక్రమిస్తారు. తత్రాపీ దేశంలో దురన్యాయాలు బాగా హెచ్చుపెరిగిపోయినప్పుడు శ్రీనగర బ్రాహ్మణ పరిషత్తే ప్రాయోపవేశాలు ప్రేరేపిస్తుంది. కాశ్మీర రాజ్యచరిత్రలో అటువంటి ప్రాయోపవేశాలెన్నెన్నో జరిగాయి.

ఒక్కొక్కప్పుడు రాజశత్రువులు గూడా రహస్యంగా ప్రాయోపవేశాలు ప్రేరేపించడం కద్దు. వాటిలోనుంచి తప్పించుకుని బయటపడడానికి కాశ్మీరాధికారులనేకమైన అగచాట్లకు లోనవుతూంటారు.

ఏది ఏమైనా బ్రాహ్మణవర్యులెవరైనా తమ ప్రాసాదప్రాంగణాలలో ప్రాణాలు పరిత్యజిస్తే కాశ్మీరరాజన్యులు తమకు తమ రాజ్యానికీ తీరని బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంటుందని భయపడతారు. అందుచేత ఆ ప్రాయోపవేశాలవిషయం పరిశీలించడానికా కాలంలో ప్రత్యేకంగా అధికారులను కూడా ఏర్పాటుచేశారు.

ప్రాయోపవేశాధికారులొక్కొక్కప్పుడు నయాన, భయాన నచ్చజెప్పి నిరశన వ్రతం అవలంబించినవారిని నిశ్శబ్దబంపించివేస్తూంటారు.

అభోజన వ్రతాలవల్ల సామాన్యంగా రాజ్యాధికారులు, రాజబంధువులు, ధర్మాధికారులు, నగరశ్రేష్ఠులు మొదలయినవారతిరహస్యంగా చేసిన దురంతాలెన్నెన్నో బయటపడుతూంటాయి. కనకనే ప్రాయోపవేశాధికారులేకాక, కాశ్మీరాధిపతులుకూడా నిరాహారవ్రతాలంటే తమ ప్రాణాలపై హఠాత్తుగా విరుచుకుపడిన పెను ప్రళయాలని భావిస్తారు. వాటి విషయంలో బాగా జాగ్రత్త వహిస్తారు.

రాజప్రాసాదానికనతి దూరంలో ఆ బడుగు బ్రాహ్మణుడలాగే భీష్మించుకుని కూర్చున్నాడు. అధికారులెంత బెదిరించినా అతను లక్ష్యపెట్టలేదు. బలవంతంగా అతణ్ని మరి ఒక చోటికి పంపించివెయ్యాలని ఆ అధికారులాలోచించక పోలేదు. కాని అది కూడా వారికి సాధ్యపడలేదు. అలా చేస్తే దారిలోనే అతడేమైనా అఘాయిత్యానికొడిగడతాడేమోనని వారి భయం! ఆ అధికారులెన్నివిధాల ప్రయత్నించినా మరి అతణ్ని అక్కణ్ణించి కదల్చలేక పోయారు!

అతడొక నిరుపేద. ఆ బ్రాహ్మణుని చుట్టూ మూగిన శ్రీ నగర పౌరులందరికీ అతని ఆ మరణాంతదీక్ష ఎంతో విడ్డూరంగా కనిపించింది. దానికి కారణం లేకపోలేదు.

ఆ కాలంలో కాశ్మీర రాజ్యాధికారం బ్రాహ్మణకులీనుడు, విద్వాంసుడు అయిన యశస్కర దేవునికి హస్తగతమయింది. అతని రాజ్యారంభంతో అంతకు పూర్వం కాశ్మీరం పరిపాలించిన ఉత్పల రాజవంశీయుల ప్రాభవం పూర్తిగా అడుగంటిపోయింది. అంతేకాదు. ఆ వంశీయుల పరిపాలనమే పూర్తిగా అంతరించిపోయింది.

ఉత్పల రాజవంశీయులలో చిట్టచివరి పరిపాలకుడు కమలవర్ధనుడు. అతని పరిపాలనలో కాశ్మీరం అనేక విధాలుగా ఛిన్నాభిన్నమైపోయింది. అంతర్యుద్ధాలతోబాటు అధర్మకృత్యాలు, పౌరకల్లోలాలు బాగా హెచ్చుపెరిగిపోయాయి.

ఆ పరిస్థితులలో దుర్భర దారిద్ర్యపీడతో దేశాలు పట్టిపోయిన యశస్కరుడు కాశ్మీరానికి తిరిగివచ్చాడు. కావడానికతడు కాశ్మీరరాజ్య కోశాధ్యక్షుని కుమారుడే. కాని, రాజ్యకల్లోలాలలో అతనితండ్రి అధికారము, ఐశ్వర్యము హారతి కర్పూరంలా హరించుకుపోయాయి. చిట్టచివరి కతనికి పట్టెడన్నంకూడా కరువైపోయింది. దారిద్ర్యపీడ పడలేక అతడొకనాడు జన్మదేశం విడిచి వెళ్ళిపోయాడు. దేశాంతరాలలో తిరిగి తిరిగి కొంతకాలానికి స్వదేశంచేరుకొన్నాడు.

కాశ్మీరంలో అప్పటికి అరాజకం బాగా హెచ్చుపెరిగింది. ఆ సమయంలో కాశ్మీర బ్రాహ్మణులంతా ఒకచోట సమావేశమైనారు. అనేక విధాల తర్జన భర్జనలు జరిపి చిట్టచివరికి సర్వసమర్థుడు, విజ్ఞుడు అన్న గౌరవంతో యశస్కరునికి కాశ్మీరరాజ్యం కైవసం చేశారు. ఆ పూట గడవక దేశాంతరాలు పట్టిపోయి యాదృచ్ఛికంగా జన్మదేశానికి తిరిగి వచ్చిన యశస్కరుని కదృష్టవశాత్తు హఠాత్తుగా రాజ్యాధికారమే హస్తగతమయింది! విధి విలాసం ఏక్షణంలో ఎటువైపు మొగ్గగలదో ఎవరు చెప్పగలరు?

కాశ్మీరరాజ్యాధికారమేలభించినా యశస్కరభూపతి చిన్ననాటి దుర్భరదారిద్ర్యవేదన ఎన్నడు మరిచిపోలేదు. ఒక్క క్షణమైనా ఏమరకుండా కాశ్మీర రాజ్యంలో



... ప్రాచీన ధర్మ సంప్రదాయాలన్నీ ప్రతి
...కారాడు. ఒకప్పుడు శ్రీనగర బ్రాహ్మణ
...కి అతని ధర్మాధర్మ నిర్ణయాలలో
...ం నోక్యం కలిగించుకోవాలని ప్రయ
...ంది. కాని అతడెక్కడా చిక్క
... అపరిమితులోని బ్రాహ్మణ
...క చేతులెత్తోడించి వినయంగా
...న్నాడు:
...ందరు ఏకగ్రీవంగా వన్నీ ధర్మ
సింహాసనంమీద ప్రతిష్ఠించారు. అటువంటి
మీకే నా ధర్మనిర్ణయానికి విరుద్ధంగా అడ్డు
తగలడం న్యాయం కాదు! మరి మన్నించండి."

దానితో ఆ బ్రాహ్మణవర్యులిక అతని ధర్మపరిపాలన, శ్రద్ధగలదానికి పొగడించలేదు. అప్పటినించీ యశస్కర దేవుని పరిపాలన కాశ్మీరంలో అంతటా అప్రతిహతంగా కొనసాగింది. అటువంటి ధర్మవేత్త, బ్రహ్మజ్ఞుడు అయిన యశస్కరుని పరిపాలనలో ఆ బదుగు బ్రాహ్మణుని కంతటి ప్రాయోపదేశం వహించవలసిన అవసరం ఏమి వచ్చింది! శ్రీనగర పౌరులా విషయాన్ని గురించి అంత వింతగా గుసగుసలాడుకోడానికీ, అంత విచిత్రంగా ఆశ్చర్యపడడానికీ గల అసలు కారణ మది! అతని అభోజన దీక్షకు రాజకీయకుట్రల కారణం ప్రాతిపైనా కారణమేమో అని రాజాధి

# ★ న్యాయపరిశీలనం ★

కొగులా విషయం అంతా బాగా లోతుగా పరిశీలించారు. కాని ఆ విషయమైన అనుమానాని కొస్కారమేమీ కనిపించలేదు.

కాశ్మీరాధిపతి యశస్కర దేవుడే దిగి వచ్చి తనకు న్యాయం కలిగించేదాకా ఆ అభోజన దీక్ష విరమించేది లేదని అతడలాగే పచ్చి మంచినీళ్లైనా తాగకుండా భీష్మించుకుని కూర్చున్నాడు. తనకు జరిగిన అన్యాయం అంతా ఆమహారాజ సన్నిధినే నివేదిస్తానని పట్టుపట్టాడు.

ప్రాయోపవేశాధికారులిక గత్యంతరం లేక వెంటనే ఆవిషయం యశస్కర దేవునికి తెలియజేశారు. అప్పటికా బ్రాహ్మణుడు ప్రాయోపవేశం ప్రారంభించి మూడురోజులయింది. ఆవిషయం వింటూనే యశస్కర భూపతి వెంటనే అతనిని తన సన్నిధికి తీసుకురావలసిందని ఆజ్ఞాపించాడు. అధికారులప్పటికే బాగా నీరసపడిపోయిన అతణ్ణి ఒక సుఖాసనంమీద కూర్చోబెట్టి నెమ్మదిగా రాజసన్నిధికి తీసుకుపోయారు.

౨

"ఎంతమంది ధర్మాధికారుల దగ్గర మొరపెట్టుకొన్నా చిట్టచివరికి నాకన్యాయమే జరిగింది. తాము నాకు న్యాయం జరిగించక పోతే నేనిలాగే ప్రాణపరిత్యాగం చేస్తాను."

రాజదర్శనం చేసినవెంటనే ఆ బ్రాహ్మణుడావిధంగా మొరపెట్టుకొన్నాడు. అతని పేరు దేవశర్మ. సాంగవేదాధ్యయనం చేసిన మహావిద్వాంసుడు. దేవశర్మ తాతముత్తాతలందరు సోమపీథులు. న ప్రతి గ్రహీతలు. నిరతాన్న ప్రదాతలు.

అతడు తన కులగోత్రాలను గురించీ తాతముత్తాతల ఆర్షేయ పౌరుషేయాలను గురించి ఆదేధోరణిగా ఏకరువుపెట్టడం ప్రారంభించాడు. మహారాజతని ఛాందస ధోరణిచూచి కొంచెం బొమముడి విరిచాడు:

"అయితే మీ ప్రస్తుత ప్రాయోపవేశానికి కారణం?"

ఆ ప్రశ్నతో ఆ బ్రాహ్మణుడు తన ప్రాయోపవేశకారణాలన్నీ ఆమూలాగ్రంగా విన్నవించుకొన్నాడు:

"ఏలినవారు నాకుజరిగిన అన్యాయం యావత్తు జాగ్రత్తగా పరిశీలించవలసిందని కోరుకుంటున్నాను. మొట్టమొదటినించీ మాది బాగా కలిగిఉన్న కుటుంబం. అయితే నాదాకా వచ్చేసరికి ఆ ఐశ్వర్యం అంతా హరించుకుపోయింది. ఆపైన నాకు ఋణబాధ మరీ మిక్కుటమై పోయింది.

"ఇక గత్యంతరమేమీ లేక నాపిత్ర్యం అంతా తెగనమ్మివెయ్యాలనీ అన్నవస్త్రాలకోసం ఆర్యావర్తదేశం వెళ్ళిపోవాలనీ నిశ్చయించుకొన్నాను. నాకున్నదల్లా ఒకే ఒక నాలుగిళ్ల భవంతి. దాని పెరటిలో ఒక పెద్ద దిగుడుబావి, ఆబావిపక్కనే పెంచిన ఒక తాంబూలపు తీగలపందిరి ఉన్నాయి. నాకిక వేరే సంతానమేమీ లేదు. నాభార్య జీవికకోసం ఆ దిగుడుబావి, ఆతాంబూలపు తీగల పందిరి ప్రత్యేకించి, మిగిలిన భవంతి అంతా మన శ్రీనగరంలో పేరుమోసిన కర్పూర శ్రేష్ఠికి విక్రయించివేశాను.

"పది పదిహేను సంవత్సరాలు పాటార్యావర్త దేశంలో పర్యటించి తిరిగి శ్రీనగరం చేరుకొన్నాను. నాభార్య శ్రీమంతుల ఇళ్ళలో నీచదాస్యంచేసి పొట్టపోసుకుంటూంది. "నీకోసం కొంతఆస్తి ప్రత్యేకించానే! నీకిటువంటి దుర్గతి ఎందుకుపట్టింది?" అని నాభార్య నడిగాను. కర్పూర శ్రేష్ఠి నాభార్య ననేకవిధాల హింసించి దిగుడుబావి దరిమానానికి కూడా రావద్దని కసిరి కొట్టాడట! శ్రేష్ఠినడిగితే దిగుడుబావి, తాంబూలపు తీగలపందిరి కూడా తనకు తెగనమ్మివేసినట్లే సమాధానం చెప్పాడు. నేను ధర్మాధికారుల దగ్గర మొరపెట్టుకొన్నాను. వారా వ్యవహారపత్రాలన్నీ పరిశీలించి కర్పూరశ్రేష్ఠి చేసిన అన్యాయమేమీ లేదని నిర్ణయించారు.


"ఆపైన శ్రీనగర ప్రధాన ప్రాడ్వివాకుల దగ్గర కూడా నావ్యవహారం అంతా విన్నవించుకున్నాను. ఆయనకూడా శ్రేష్ఠిపరంగానే న్యాయం దయచేయించారు! అసలు నేనాదిగుడుబావి, ఆ పందిరి అమ్మనేలేదు. అయినా కర్పూర శ్రేష్ఠి నేనవి తనకు తెగనమ్మివేశానని తెగనాడుతున్నాడు. ఆ వ్యవహారపత్రాలు పరిశీలించిన ప్రధాన ప్రాడ్వివాకులు కూడా అదేవిధంగా తీర్పు దయచేయించారు.

"ఇక నాకు వేరే గత్యంతరమేమీ లేక ఈ ప్రాయోపవేశదీక్ష కుపక్రమించాను. మా వంటి అభాగ్యులకు జరిగిన అన్యాయం తమరు విచారించక పోతే ఇంకెవరు విచారిస్తారు! గాయత్రీ సాక్షిగా విన్నవించుకుంటున్నాను. నాకీ వ్యవహారపత్రాల ధర్మసూక్ష్మాలేవీ తెలియవుగాని ఆ దిగుడు బావి, ఆపందిరి ముమ్మాటికీ నేనమ్మలేదు. నాత్రేతాగ్ని సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను."

ఆపైన ఆ బ్రాహ్మణుని కంఠం గద్గదభారంలో స్తంభించిపోయింది.

యశస్కర దేవుడా బ్రాహ్మణుని ధోరణి అంతా అతిజాగ్రత్తగా పరిశీలించాడు. అతడు కొంచెం ఛాందసుడనీ, అమాయికుడనీ గుర్తించాడు. నెమ్మదిగా బుజ్జగించాడు:

"నేనీ వ్యవహారం అంతా అక్షరశః పరిశీలిస్తానని వాగ్దానం చేస్తున్నాను! మీరు

చర్మపుబాధలకన్నిటికి

"సైబాల్"

చర్మవాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విషక్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చుడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబీ గ్రైప్"

తయారుచేయువారు:

దిసౌత్ ఇండియన్

మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు:

సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.



వెంటనే ఈ ప్రాయోపవేశదీక్ష విరమించండి."

"మహాప్రభూ! తమరు న్యాయం దయ చేయిస్తారని నాకు తెలుసును! కనుకనే మీ సన్నిధికి వచ్చాను. అయితే ఈ వ్యవహారం అంతా పూర్తిగా తేలేదాకా నేనిక పచ్చి మంచినీళ్ళనా ముట్టేదిలేదు!"

అని నిష్కర్షగా సమాధానం చెప్పాడు. అమాయికుడయినా అతను పట్టినపట్టు విడిపించడం మరి బ్రహ్మతరం కాదని మహారాజు కనిపెట్టాడు. మళ్ళీ వెంటనే అతన్ని ప్రాయోపవేశప్రదేశానికి పంపించివేశాడు.

వెనువెంటనే శ్రీనగర ప్రధాన ప్రాడ్వివాకునికి కబురుపెట్టాడు. అతను ముచ్చెమటలు కక్కుతూ మహారాజ సన్నిధికి వచ్చి దోసిలిఒగ్గి నిలుచున్నాడు. ఆ వ్యవహార విషయం అంతా విపులంగా యశస్కరదేవునికి నివేదించాడు:

"నేనా వ్యవహారపత్రాలన్నీ స్వయంగా పరిశీలించి చూచాను. ఆ పత్రాలలో ఆయన ఆభవంతి అంతా పూర్తిగా కర్పూర శ్రేష్ఠికమ్మివేసినట్లే ఉంది. అయితే ఆ బ్రాహ్మణుడు పరమఛాందసుడు. పైగా తాబట్టిన కుందేటికి మూడే కాళ్ళని కూర్చుంటాడు. అంతేకాదు. అతను పరమమూర్ఖుడు! ఆ పరిస్థితులలో ఎవరు మాత్రం ఏమి చెయ్యగలరు! అలాంటి మూర్ఖుడు ప్రాయోపవేశం చేసి ప్రాణాలు విడిస్తే దానితో మరి మన పీఠ అంతా విరగడై పోతుంది."

యశస్కరదేవుని కంతవరకు శ్రీనగర ప్రధాన ధర్మాధికారి సచ్ఛీలం శంకించవలసిన అవసరమే కలగలేదు. అతడంత నిష్కర్షగా ఆ వ్యవహారం ఆ విధంగా తుంచివేసి మాట్లాడినప్పుడిక మహారాజు మాత్రమేమి చెయ్యగలడు!

ప్రధాన ధర్మాధికారిని పంపించివేసి మహారాజు మళ్ళీ దీర్ఘాలోచనలో పడ్డాడు.

ఎంతసేపటికీ అతనికా వ్యవహారమేమీ అంతుబట్టలేదు. రాజ్యాధికారం చేపట్టిన పిమ్మట అతడు ఆ రాజ్యంలో అనేకమైన నూతన సంప్రదాయాలాచరణలో పెట్టించాడు.

అంతకుపూర్వం కాశ్మీర బ్రాహ్మణులవసరమైతే కత్తి చేతబట్టి రణరంగంలో వీరవిహారం చేసేవారు. యశస్కర భూపతి వారికటువంటి అవసరమే లేకుండా చేశాడు. అప్పటినించీ వారు తమ కత్తులు, కఠారులు ఒక మూలపెట్టి శస్త్రవ్యాసంగానికి స్వస్తి చెప్పి శాస్త్రవ్యాసంగంలో పడ్డారు.

కాశ్మీరంలో చలి ఎముకలు కొరికి వేస్తుంది. అందుచేత సామవేదాధ్యాయ సమయంలో నైష్ఠికులు కూడా మధ్య మధ్యన కొంచెం మద్యపానం చేసేవారు. బ్రాహ్మణకులీనుడు యశస్కర భూపతి రాజ్యానికి వస్తూనే ఆ దురాచారం సంప్రదాయ విరుద్ధమని వెంటనే అది నిషేధించాడు. యశస్కర మహీపతి రాజ్యానికి రాకపూర్వం కొంచెం చీకటిపడగానే వర్తకులందరు దొంగతనాల భయంవల్ల తమ క్రయ విక్రయ వ్యవహారాలు కట్టిపెట్టి వేసేవారు. యశస్కరుడు అర్ధరాత్రిదాకా అంగళ్ళలాగే తెరిచి ఉంచవలసిందనీ, ఇక దొంగల భయం ఉండబోదనీ అభయప్రదానం చేశాడు. ఆనాటి నించీ కాశ్మీర రాజవీధులలో అంగళ్ళన్నీ అర్ధరాత్రివరకు తెరిచిఉంచడంమొక పరిపాటిగా మారింది.

ఆ విధంగా నిష్కంటకంగా సాగే అతని ధర్మపరిపాలనలో ఒక బడుగు బ్రాహ్మణుడు ధర్మాధికారులంతా ఏకగ్రీవంగా తన కన్యాయం చేశారని మొరపెట్టుకొన్నాడు. అతని అమాయిక ధోరణి పరిశీలిస్తే అతని కేదో దురన్యాయం జరిగినట్లే తట్టింది. కాని యశస్కర భూపతి ఎంత ప్రయత్నించినా ఆ దురన్యాయం ఎక్కడ జరిగిందో తెలియలేదు. మరికొంత సేపటివరకు అలాగే తల బద్దలుకొట్టుకుని ఆ మరునాడే ఆ బ్రాహ్మణుని వ్యవహారం అంతా స్వయంగా పరిశీలిస్తున్నానని శ్రీనగర ప్రధాన ప్రాడ్వివాకునికొక శ్రీముఖం పంపించాడు. ప్రతివాదిని, ప్రాడ్వివాకులను వ్యవహారపత్రాలతో సహా కొలువుకూటానికి పిలిపించవలసిందని ఆ శ్రీముఖంలో ప్రత్యేకంగా ఆజ్ఞాపించాడు. మహారాజాజ్ఞ ప్రకారం ఆ మరునాటి ఉదయమే రాజప్రాసాదంలోని కొలువుకూటంలో న్యాయపరిశీలనం ప్రారంభమయింది.

## 3

కర్పూరశ్రేష్ఠి, అతనితో బాటతని లేఖకులు ఒకమూలగా నిలుచున్నారు. ఇంకొక మూల దేవశర్మ వ్యవహారం పరిశీలించిన ప్రాడ్వివాకులు తమ ఉచితమైన సుఖాసనాలలో కూర్చుని ఆ వ్యవహార స్వరూపం అంతా మహారాజుకు నివేదిస్తున్నారు. దేవశర్మ అప్పటికి బాగా నీరసించిపోవడంవల్ల ప్రత్యేకంగా అతనినక్కడికి పిలిపించలేదు. అతని వాఙ్మూలం అంతా భూర్జపత్రంమీద భద్రపరిచిన ఒక ప్రధానాధికారి అది చేతబుచ్చుకుని సిద్ధంగా నిలుచున్నాడు. మహారాజు కర్పూరశ్రేష్ఠిమీద శరపరంపరగా ప్రశ్నవర్షం కురిపించాడు.

శ్రేష్ఠి ఎంతసేపు తానుచేసిన అపరాధమేమీ లేదని అనేకవిధాల సత్యప్రమాణాలు చేశాడు. తన వ్యవహారానికి వ్యవహార పత్రాలే సాక్షులనీ, వ్యవహారంపుట్టి పదిపదిహేను సంవత్సరాలు జరిగిపోవడంవల్ల ఆనాటి వృద్ధసాక్షులంతా గతించారనీ, కనక వ్యవహార పత్రాలే జాగ్రత్తగా పరిశీలించి తనకు న్యాయం దయ చేయించవలసిందనీ ప్రాధేయపడ్డాడు. తన వ్యవహారాలలో ఎన్నడు తభావతు రాలేదనీ అన్యాయంగా తనమీద విరుచుకు పడే బ్రహ్మహత్యాపాతకం నివారించవలసిందనీ బతిమాలుకొన్నాడు.

మహారాజొక నిట్టూర్పు విడిచి పెట్టాడు. శ్రీనగర ప్రధాన ప్రాడ్వివాకునికా వ్యవహారపత్రం మళ్ళీ ఒకమారు పరిశీలించవలసిందని ఆజ్ఞాపించాడు.


ప్రాడ్వివాకుడది అందరికీ వినబడేటట్టు గట్టిగా పైకి చదివాడు:

"సోపానకూప సహితం
విక్రీతం గృహం"

సోపాన కూపమంటే దిగుడు బావి.

'దిగుడు బావితో కలిపి ఆభవంతి అంతా అమ్మివేయడమైనది'

అని వ్యవహారంపత్రంలో కూడా అక్షరాలా దిగుడు బావితో సహా ఆభవంతి అంతా అమ్మివేసినట్లే ఉంది. మహారాజా వ్యవహారపత్రం చేత బుచ్చుకుని అదంతా అతి జాగ్రత్తగా పరిశీలించాడు. అతనికిక ఏమనడానికీ పాలుపోలేదు. ఇంకొక వేడి నిట్టూర్పు విడిచిపెట్టి ఆపత్రం తిరిగి ప్రాడ్వివాకునికిచ్చాడు. ఆ సమయంలో యశస్కరుని కొకవేళ ఆ బ్రాహ్మణుడే అన్యాయాన్ని కోడిగడుతున్నాడా! అని స్ఫురించింది. ఉసూరుమని మళ్ళీ ఇంకొక వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు. అటుపిమ్మట మరి మహారాజా విషయమే పట్టించుకోలేదు. క్రమక్రమంగా మహా


"జి.ఇ.సి" మోటారు
మోనోబ్లాకు పంపుసెట్లు
స్టాకునుండి
ఇవ్వగలము
తాతా - ప్రభాత
(తంతి ... తత్ప్రభ)
విజయవాడ ...2

# ★ న్యాయ పరిశీలనం ★

రాజు, ప్రాడ్వివాకులు ఏదో ఇష్టాగోష్ఠిలో పడ్డారు.

కర్పూర శ్రేష్ఠి ఆ వ్యవహారం ఇక తన కనుకూలంగా పరిష్కరింపబడగలదని లోలోపల బాగా మురిసిపోయాడు. యశస్కరదేవుని ముఖంలో ఆవిషయంలో అంతకు పూర్వం కనిపించినంతగా శ్రద్ధాసక్తులు కనిపించలేదు. అతడు తనకనతి దూరంలో కూర్చున్న ప్రాడ్వివాకుని చూపుడు వ్రేలిమీద మెరిసే రత్నాంగుళీయకం వైపెంతో ఆశ్చర్యంగా చూచాడు:

"ఎక్కడ సంపాదించారో గాని చాలా సొగసైన నాగముద్రిక సంపాదించారే"

ప్రాడ్వివాకుడతి వినయంగా లేచి నిలబడి ఆ అంగుళీయకం తీసి మహారాజు చేతికందిచ్చాడు:

"ఇది పరిహాసపురంలో చేయించిన నాగముద్రిక. అయితే రత్నాలంత ప్రశస్తమయినవి కావు. మావంటి వాళ్లకు జాతి రత్నాలెక్కడినించి వస్తాయి మహాప్రభూ!"

మహారాజింకొక ప్రాడ్వివాకుని వ్రేలి రత్నాంగుళీయకం పరిశీలించాడు. తరవాత అతని దృష్టి కర్పూర శ్రేష్ఠి చేతి రత్నాంగుళీయకం మీద పడింది:

"శ్రేష్ఠివర్యా లెక్కడ సంపాదించారో గాని చాలా విలువైన వజ్రం సంపాదించారే!"

శ్రేష్ఠి తన చేతి అంగుళీయకం తీసి మహారాజసన్నిధిని ఉంచాడు:

"ఇది పెళ్లినాడు మా మామగారు బహూకరించిన జాతివజ్రం! పదివేల సువర్ణ దీనారాల విలువ చేస్తుందని రత్నపరీక్షకులంటున్నారు. ఇంతకీ వారెంత చెబితే అంత! ఆ గొడవ మావంటివాళ్లకేమి తెలుస్తుంది! అదీగాక ఏదో మామగారిచ్చారుగదా అని వేలికి పెట్టుకొన్నానుగాని లేకపోతే మేమెక్కడ! అసలైనజాతి వజ్రాల ఉంగరాలెక్కడ!"

అని సన్నసన్నగా చప్పరించివేశాడు.

మహారాజా వజ్రపుటుంగరం తన అనామికాంగుళి కలంకరించుకొన్నాడు. ఎంతో మురిసిపోతూ ఆ అంగుళీయకం వైపే చూచాడు.

"ఇది ప్రభువువారు. బంగారు వ్రేలి కలంకరించుకోవలిసిన రత్నాంగుళీయకం! అంతేగాని మావంటివాళ్ళకది వేలికి పెట్టుకునే అర్హత ఎక్కడిదీ?"

అని సన్నసన్నగా నసిగాడు శ్రేష్ఠి. ఆ మాట విని మహారాజొకక్షణం నిశితంగా ఆలోచించాడు:

"మీ రలా గనడం న్యాయం కాదు, ఊరికే ఒకమారు వేలికి పెట్టుకుని చూదామని అడిగాను! అంతే!"

ఆ విషయం అంతటితో తుంచివేశాడు యశస్కరదేవుడు.

శ్రేష్ఠి తనవల్ల పెద్ద పొరబాటే జరిగిపోయిందని నాలిక కరుచుకొన్నాడు. మళ్ళీ సన్నసన్నగా నసిగాడు:

"ఎంతమాట! తమ కిలాంటి ఉంగరాలు ఒక లెక్కా! ఇవి మీ అంతఃపుర దాసీలు కాళ్ళకు మట్టెల్లా అలంకరించుకుంటారు! నాకు మాత్రం తెలియదా! ఏదో తెలియక అన్నాను. ప్రభువువారు కటాక్షించాలి!"

అని శ్రేష్ఠి వంకవంక దణ్ణాలు పెట్టాడు. మహారాజా పైన అతనిమాట అంతగా పట్టించుకోలేదు. మళ్లీ కొంతసే పిష్టాగోష్ఠి నడిచింది.

రాజాభ్యంతర మందిరంలో మధ్యాహ్న వేళా సూచకమైన మంగళ తూర్యాల సవ్వడి ఉవ్వెత్తుగా వినిపించింది.

ఇప్పుడే తిరిగి వస్తున్నానని చెప్పి మహారాజు వెనువెంటనే తన అభ్యంతర మందిరంలోనికి వెళ్ళిపోయాడు.

౪

"ఎంతటి అత్యవసరం వ్యవహారమున్నా మహారాజొక్క క్షణమైనా మధ్యాహ్న సంధ్యవేళ దాటనీయరు! నిత్యనైమిత్తికాలయందు వారి కుంకున్నట్టి ఆస్థ అటువంటిది!"

అన్నాడొక ప్రాడ్వివాకుడు.

"వారిప్పుడే ఒక అరగడియలోనే తిరిగి వచ్చి వేస్తారు."

అన్నాడింకొక ప్రాడ్వివాకుడు.

"తొందరగా లోపలికివెళ్ళిపోతూ నా ఉంగరం తిరిగి నాకిచ్చి వెయ్యడమే మరిచినట్టున్నారే మహాప్రభువులు!"

అని లోలోపలే సణుగుకున్నాడు కర్పూర శ్రేష్ఠి.

ఇక మిగిలిన సదస్యులందరు తలకొక విధంగా పిచ్చాపాటీ మొదలుపెట్టారు.

మహారాజభ్యంతర మందిరంలోనికి వెళ్ళి అప్పుడే అరగడియ దాటిపోయింది. అయినా ఇంకా తిరిగి రాలేదు ఇంకొక్క అరగడియకూడా గడిచిపోయింది.

అంతలో వందిమాగధుల స్తోత్ర పాఠాలు, మంగళతూర్యాలు భోరున మారుమోగాయి. యశస్కర మహీపతి మెరుపులావచ్చి తన ధర్మాసనంమీద కూర్చున్నాడు. సదస్యులంతా సవినయంగా ప్రత్యుత్థానంచేసి తిరిగి తమ తమ సుఖాసనాల్లో కూర్చున్నారు.

మహారాజిక తమ ధర్మ నిర్ణయం తనపరంగానే నిర్ణయించగలరని కర్పూర శ్రేష్ఠి ఎదురుతెన్నులు చూస్తూ నిలుచున్నాడు. కాశ్మీరాధిపతి నిశితంగా కర్పూర శ్రేష్ఠివైపు చూచాడు:

"ఇంతకీ ఈ వ్యవహారం విషయంలో మీరేమంటారు?"

"ఇంకా విన్నవించడాని కేమిఉంది. మహాప్రభూ! తమరన్ని విషయాలు కూలంకషంగా పరిశీలించారుగదా! ఇక తమ ధర్మనిర్ణయం కోసమే ఎదురు చూస్తున్నాను."

మహారాజుమళ్ళీ అడిగాడు:

"ఇలాంటి వ్యవహార పత్రాలు వ్రాసే కాయస్థులకు సామాన్యంగా మీరెన్ని దీనారాలిస్తారు?"

"ఎన్నోనా? నాలుగైదు దీనారాలకంటె ఎక్కువ ఇచ్చే అలవాటులేదు."

"అంతేనా?"

"అంతే మహాప్రభూ!"

మహారాజొకక్షణం సేపేదో ఆలోచించాడు:

"అయితే ప్రస్తుతం వివాదంలో ఉన్న వ్యవహార పత్రానికి మీరెన్ని దీనారాలిచ్చారు?"

"అయిదు దీనారాలే!"

"అంతేనా!"

"అంతే!"

"కాదేమో?"

ఖచ్చితంగా ప్రశ్నించాడు మహారాజు.

"మహాప్రభూ! తమదగ్గర నేనసృతం చెబుతానా? ఎంతమాట!"

శ్రేష్ఠిమాట కొంచెం తడబడింది.

"మీరీ వ్యవహారపత్రం లిఖించిన కాయస్థునికి నూరు సువర్ణ దీనారాలిచ్చారు! అవునా? కాదా?"

అని గట్టిగాగర్జించాడు యశస్కరభూపతి. శ్రేష్ఠి తెల్లబోయాడు. అతి రహస్యంగా దాచిన ఆవిషయం మహారాజెలాగ్రగహించారో అతనికేమీ అంతు చిక్కలేదు. అయినాగట్టిగాగోడకట్టినట్టబద్ధమే చెప్పాడు:

"లేదు! మహాప్రభూ! నూరు బంగారు దీనారాలెందుకిస్తాను?"

"ఇచ్చినట్టు నాకు గట్టిసాక్ష్యమే దొరికింది. దీనికేమి సమాధానం చెబుతారు?"

"కిట్టనివారెవరైనా తమకేమైనా కూటసాక్ష్యం చెప్పారేమో!"

ఆపైన శ్రేష్ఠినూరు దీనారాలివ్వడం జరగనే లేదనికులదైవసాక్షిగా ప్రమాణం చేశాడు.

"మీ రావిధంగా నూరు దీనారాలివ్వడానికి కారణంకూడా నాకిపుడిప్పుడే అవగాహన అయింది. ఇప్పటికైనా మీరు చేయించిన కూటకరణం అంగీకరిస్తారా? లేదా?"

యశస్కరుని వాడిమాపులు నిప్పులు చెరి

(౫౬-వ పేజీ చూడండి)

## అమెరికా అధ్యక్షుని ఎన్నిక

(4-వ పేజీ తరువాయి)

యగానే అతన్ని సమర్థించేవారంతా జెండాలు ఊపుతూ, నినాదాలు చేస్తూ మహారభస చేస్తారు. ఈ ఉపన్యాసాలూ, సమర్థింపులూ అయ్యాక వోటింగ్ జరుగుతుంది. సభ్యులలో అధికసంఖ్యాకులు ఎవరికి వోటు చేస్తే ఆ అభ్యర్థే నియమించబడతాడు. అధిక సంఖ్యాకుల వోట్లు ఏ అభ్యర్థికీ రాకపోతే మళ్లీ వోటింగ్ జరుగుతుంది. అధిక సంఖ్యాకులవోట్లు ఏ అభ్యర్థికో ఒకడికి వచ్చేదాకా వోటింగ్ జరుగుతూనే వుంటుంది. 1920 లో డెమొక్రాటిక్ జాతీయ మహాసభ 44 సార్లు బాలెట్ చేస్తేగాని జేమ్స్ఎమ్. కాక్స్ అభ్యర్థిత్వం నెగ్గలేదు. 1924 లో జాన్ డబ్ల్యు. డేవిస్ 103 సార్లు బాలెట్ అయిన తర్వాత నెగ్గాడు.

అలా నెగ్గిన అభ్యర్థి దేశ అధ్యక్ష పదవికి అభ్యర్థిగా పార్టీ తరఫున నిలబడతాడన్నమాట. అక్కణ్ణుంచి పార్టీ ప్రచారం ప్రారంభమవుతుంది. ముందు నెమ్మదిగా మొదలవుతుంది. ఎన్నిక దగ్గరవుతున్నకొద్దీ పుంజుకుంటుంది. సెప్టెంబరు, అక్టోబర్లువచ్చేసరికి ప్రతిపౌరుడూ తప్పించుకుందామన్నా ఈపార్టీల ప్రచారం నుంచి తప్పించుకోలేడు. అభ్యర్థులిద్దరూ, పార్టీనాయకులు, ప్రముఖులూ అమెరికాలోని 48 రాష్ట్రాలలో అటునుంచి ఇటూ, ఇటూ నించి అటూ విమానాల్లో, రైళ్ళలో సంచారం చేస్తారు. రేడియోలలో, టెలివిజన్లో, సినిమాల్లో ఎక్కడ చూసినా వాళ్ళే కనబడతారు. వాళ్ళే వినబడతారు. దీనికి ఎన్నికోట్లు ఖర్చవుతాయో చెప్పలేము. పెద్దపెద్ద పారిశ్రామికులు, వ్యాపారస్థులు ఈప్రచారానికి పెట్టుబడి పెట్టి ఆదుకుంటారు. నవంబరు మొదట్లో ఎన్నికలు జరుగుతాయి. అధ్యక్షుణ్ణి, ఉపాధ్యక్షుణ్ణి, దిగువ శాసనసభ సభ్యుల్ని, సెనేట్ లో మూడోవంతు సభ్యుల్ని ఆరోజున ఎన్నుకుంటారు. పోలింగ్ అయిపోయిన కొన్నిగంటల్లో ఏ అభ్యర్థి అధ్యక్షుడయ్యేదీ, కాంగ్రెసులోపార్టీ బలాబలాలు ఎలా ఉండేదీ తెలిసిపోతుంది.

అయితే అధ్యక్షుని ఎన్నిక పరోక్షపు ఎన్నిక గనుక ప్రజలచేత ఎన్నుకోబడిన ఎలెక్టర్లు మళ్ళీ వోటుచేసి అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటారు. ఈ ఎలెక్టర్ల సంఖ్య మొత్తం కాంగ్రెసు సభ్యుల సంఖ్యకు సమానం.

ఈ ఎలెక్టర్లలో అధికసంఖ్యాకులు డెమొక్రాట్ అభ్యర్థికి వోటుచేస్తే డెమొక్రాట్ అభ్యర్థి అధ్యక్షుడవుతాడు. రిపబ్లికన్ అభ్యర్థికి వోటుచేస్తే రిపబ్లికన్ అభ్యర్థి అధ్యక్షుడవుతాడు. గెలిచిన అభ్యర్థికి ప్రజలలో అధికసంఖ్యాకులు వోటుచేసి ఉండాలన్న నియమం లేదు. ఎలెక్టర్లలో అధికసంఖ్యాకులు వోటుచేస్తే, గెలుస్తాడు. ★

## ★ న్యాయ పరిశీలనం ★

(24-వ పేజీ తరువాయి)

గాయి. శ్రేష్ఠికి నాలుక పిడచకట్టుకుపోయింది. అప్పటికీ మహారాజంత కవ్వించి ప్రశ్నించడానికిగల కారణమేమీ అతనికి తెలియలేదు.

"ఇదిగో! మీరు చేయించిన కూటకరణానికి ప్రబలసాక్ష్యం!"

మహారాజు తన పక్కనే దంతపేటికలో అతిభద్రంగా దాచిన భూర్జపత్ర గ్రంథం ఆపక్కనే కూర్చున్న ప్రధాన ప్రాడ్వివాకుని ముందుంచాడు.

దానిలో ఆ వ్యవహారపత్రం వ్రాసినందుకు ప్రతిఫలంగా నూరు సువర్ణదీనారాలిచ్చినట్లు స్పష్టంగా వ్రాసిఉంది. ప్రాడ్వివాకుడది పదిమందికీ వినబడేటట్టు గట్టిగా పైకి చదివాడు.

శ్రేష్ఠి ఆలెక్కలపుస్తకం అతిభద్రంగా తన శయ్యాగారంలో జాగ్రత్త చేసుకుంటాడు. దానిఉనికి శ్రేష్ఠికీ, అతని ప్రధాన కాయస్థునికీతప్ప ఇక రెండోకంటివాడెవ్వడికీ తెలియదు. ఆపుస్తకం మహారాజెలాగ సంపాదించారో అతనికంత వరకు తెలియనేలేదు! ఆకంగారులో అతని ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. మహారాజు తిరిగీ ఇంకొకమారు గర్జించాడు:

"ఇదిగో! మీరుచేయించినకూటకరణం!"

అని మహారాజింకొక భూర్జపత్రగ్రంథం హఠాత్తుగా తన దంతపేటికలోనించి పైకి తీశాడు. పక్కనే ఉన్న ప్రాడ్వివాకుని కందించి కూటకరణం జరిగినభాగం ప్రత్యేకంగా అతనికి నిర్దేశించి చూపించాడు.

అదిచూచి ప్రధాన ప్రాడ్వివాకుడిక వంచినతల పైకెత్తలేకపోయాడు. లేచి నిలబడి ముందుగా తన ప్రమాదం మన్నించవలసిందని మహారాజును ప్రార్థించుకొన్నాడు.

పిమ్మట ఆ కూటకరణ స్వరూపం సదస్యులకందరికీ వెల్లడించాడు:

"మేమీ వ్యవహారపత్రం ఇంతకుపూర్వం పరిశీలించాము కాని మా కీవిషయం స్ఫురించనేలేదు! ధర్మమూర్తులు, విద్వద్వరేణ్యులు అయిన మహారాజు కనకనే వారికిది సులభంగా స్ఫురించింది. ఈ వ్యవహారపత్రంలో—

"సోపాన కూపరహితం" అని వ్రాసిన చోట రహితానికి బదులుగా 'సహితం' అని శ్రేష్ఠిప్రధాన కాయస్థుడు కూటకరణం చేశాడు. ఇదిగోమీరంతా చిత్తగించండి!"

అని ఆ భాగం ప్రత్యేకంగానిర్దేశించి వారికందరికీ చూపించాడు. "సోపాన కూపరహితం విక్రీతం గృహం" అంటే "దిగుడుబావి మినహాయించి మిగిలిన భవంతి అంతా అమ్మివేయడమైనది." అని అర్థం.

కాని కర్పూరశ్రేష్ఠి వ్రాయసకాడు 'రహితం' అనే పదంలో 'ర' కారానికి బదులుగా 'స' కారం వ్రాసి 'సహితం' అని మార్చివేసి దారుణమైన కూటకరణ పాపానికి పాల్పడ్డాడు. 'సహితం' అని మార్చగానే 'దిగుడుబావితోసహా భవంతి అంతా అమ్మివెయ్యడమైనది.' అనే అర్థం ఏర్పడింది.

నాగరలిపిలో 'ర' కారం సులభంగా 'స' కారంగా మార్చివెయ్యవచ్చును. శ్రేష్ఠి దగ్గర నూరు బంగారు దీనారాలు స్వాహాచేసి అతని ప్రధాన కాయస్థుడు ఆ అక్షరం ఆవిధంగా మార్చివేశాడు. సదస్యులదంతా ఒక క్షణంలో అవగాహన చేసుకుని హాహాకారాలు చేశారు.

అంతలో మహారాజింకొక మారు గట్టిగా గర్జించాడు:

"మీరీ అంగుళీయకం నేనేమైనా అపహరిస్తానని భయపడుతున్నారేమో! ఇదిగో మీవజ్రాంగుళీయకం! తీసికోండి!" అని తిరిగీ అది శ్రేష్ఠికిప్పించాడు.

అప్పటికి శ్రేష్ఠికి జరిగినదంతా మంచు విడిపోయినట్లు విడిపోయింది.

మధ్యాహ్నవేళ మహారాజా ఉంగరం తన పేరుమీదుగానే తన ప్రధానకాయస్థునికి దగ్గిరికి పంపించాడనీ, తిరిగి తన పేరుమీదుగానే తాను రహస్యంగా దాచిఉంచుకొన్న కలిలెకట్ట కొలువుకూటానికి తెప్పించుకొన్నాడనీ, ఆవిధంగా తన మోసం అంతా బట్టబయలయి పోయిందనీ శ్రేష్ఠి గ్రహించుకొన్నాడు.

ఇక గత్యంతరంలేక తన తప్పిదం ఒప్పుకున్నాడు. ప్రథమ తప్పిదంగా మన్నించి కొంచెంకనికరించవలసిందని ప్రాధేయపడ్డాడు.

ఆ దారుణ కూటకరణానికి శిరశ్ఛేదశిక్ష విధించవలసిందే! కాని మహారాజతనిమీద కొంచెం కనికరించాడు. ముందుగా ఆ భవంతి అంతా దిగుడుబావితోసహా దేవశర్మకు స్వాధీనచెయ్యవలసిందని ఆజ్ఞాపించాడు. కర్పూరశ్రేష్ఠిని సకుటుంబంగా కాశ్మీరదేశాన్నించి వెడలగొట్టించాడు. శ్రేష్ఠి ఆస్తిపాస్తులన్నీ దేవశర్మకు చెందవలెనని ఆజ్ఞాపించాడు.

ఆ తీర్పు విన్న కర్పూర శ్రేష్ఠి ప్రాణాలతోనైనా బతికి బయటపడ్డానని ఒక్క వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు.

కర్ణాకర్ణిగా ఆ న్యాయపరిశీలనగాథ విన్న శ్రీనగరపౌరులు యశస్కరదేవునికి చేయెత్తి నమస్కరించి జయజయధ్వానాలు చేశారు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.